కరీంనగర్‌లో గెలిచేది బీఆర్ఎస్సే

కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కోహెడ, ఏప్రిల్ 10: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో గెలిచేది బీఆర్ఎస్సే అనే కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. పార్టీ వదిలిన వారి గురించి మాట్లాడేది లేదని, ఉన్నవాళ్లను పార్టీ కాపాడుకుంటుందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలాల బాట పట్టగానే కాంగ్రెస్‌కు భయం పుట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 100 రోజులు దాటినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. యాసంగి వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చేవరకు వదిలిపెట్టేదిలేదన్నారు. పార్లమెంట్‌లో ప్రజల సమస్యలపై గళం విప్పి నిధులు తెస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటవుతున్నాయని, గత ఐదేండ్లలో కరీంనగర్ నుంచి గెలిచిన బండి సంజయ్ చేసింది ఏమీలేదన్నారు. అబద్ధాల హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అడ్డగోలు హామీలు ఇచ్చి అమలు చేయడంలో ఆగమైందన్నారు. రైతు భరోసా ద్వారా రూ.15,000, మహిళలకు రూ. 2,500 ఆర్థిక సహాయం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. రైతులకు బోనస్ ఇచ్చే వరకు ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కేసీఆర్ బయటకు రాగానే గాయత్రి పంపు హౌస్ మోటార్లు ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీకాంత్, జిల్లా నాయకులు సురేశ్, ఆవుల మహేందర్, తడ్కుల రాజిరెడ్డి, భీంరెడ్డి రాజిరెడ్డి, ఇప్పరపల్లి కృష్ణమూర్తి, లక్ష్మణ్, సంజీవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, షేక్ వలీ, కుమారస్వామి, సుతారి కనుకయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్10 : ఈద్-ఉల్-ఫితర్ (రం జాన్) పర్వదినం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకొనే గొప్ప పండుగల్లో రంజాన్ ఒకటి అని కొనియాడారు. లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అల్లా దయతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. కుల మతాలకతీతంగా కలిసిమెలిసి జరుపుకొనే సంస్కృతి మన తెలంగాణలో ఉందన్నారు. ముస్లింలు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లా దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకలశుభాలు కలుగాలని ఆయన ఆకాంక్షించారు.

చివరి దశలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు ప్రక్రియ

చేర్యాలలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మనోహర్

చేర్యాల, ఏప్రిల్ 10 : పట్టణంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు ప్రక్రియ చివరి దశలో ఉన్నదని, త్వరలో కోర్టు సేవలు చేర్యాల మున్సిపాలిటీ, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని కక్షిదారులకు అందనున్నాయని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు భూమిగారి మనోహర్ తెలిపారు. పట్టణంలో బుధవారం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ కోర్టు ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాలకు సంబంధించిన(ఆర్థిక, ఉద్యోగుల నియామకం)ఫైల్ పై సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారన్నారు. ప్రస్తుతం కోర్టు ఏర్పాటు ఫైల్ ఫైనాన్స్ సెక్రటరీ వద్ద ఉందని, త్వరలో వారి నుంచి అనుమతి రాగానే కోర్టు ఏర్పాటు పనులు పూర్తవుతాయన్నారు.కోర్టు ఏర్పాటు కోసం తాము అన్ని వర్గాలతో కలిసి కృషి చేస్తున్నామని, ఇటీవల కోర్టు ఏర్పాటు కోసం కొందరు న్యాయవాదులు కలిసి అడహక్ కమిటీ ఏర్పాటు చేసుకున్నారని, దానితో తమకు సంబంధం లేదన్నారు. కోర్టు ఏర్పాటుకు ముందే న్యాయవాదులు గ్రూపులుగా విడిపోయి కమిటీలు వేసుకుంటే ఉన్నత స్థాయిలో ఉన్న వారికి మరో విధమైన సూచనలు వెళ్తాయనే విషయాన్ని లాయర్లు గమనించాలన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ వివరాలు వెల్లడించారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా సురేందర్, జనరల్ సెక్రటరీగా ప్రణీత్, జాయింట్ సెక్రటరీగా రాములు, ట్రెజరర్‌గా సురేందర్, స్పోర్ట్స్ , కల్చరర్ సెక్రటరీగా అమర్‌గౌడ్ ఎన్నికైనట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తాం

గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 10: రాష్ట్రంలోని మాదిగలను అవమానించిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో భూస్థాపితం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణ అన్నారు. మాదిగలకు పార్లమెంట్ సీట్లు కేటాయించడంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మూడు ఎంపీ సీట్లు ఉంటే ఒక్కసీటు కూడా కేటాయించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాదిగలకు ద్రోహం చేసిందన్నారు.దళితుల్లో 75శాతం ఉన్న మాదిగలకు ఒక్కసీటు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో నాయకులు రాములు, పరశురాములు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, ముక్కపల్లి రాజు, రమేశ్, నర్సింహులు, స్వామి, ప్రశాంత్, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే అలయన్స్ లక్ష్యం

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 10 : పేదలకు సేవ చేయడమే అలయన్స్ లక్ష్యమని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ వైర్మన్ ఆత్మరాములు అన్నారు. అలయన్స్ క్లబ్ జిల్లా స్థాయి సమావేశం బుధవారం స్థానిక పార్వతిమాత ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లుగా జిల్లాలో అలయన్స్ క్లబ్ సేవలు అందిస్తుందన్నారు. అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ బాల చంద్రం,సెక్రటరీ ఈశ్వర్ చరణ్, పీఆర్‌వో సుజాత, రామచంద్రం, వైకుంఠం, వనజ, రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు, ఏప్రిల్ 10 : మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు సాగునీరు, రైతు బంధు, పంట నష్ట పరిహారం ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించి.. మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశానుసారం గురువారం ఉదయం 11:00 గంటలకు పెద్ద కోడూరులోని రేణుకామాత ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ చిన్నకోడూరు మండల పార్లమెంట్ ఎన్నికల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామని శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నారాయణ

మిరుదొడ్డి, ఏప్రిల్ 10 : ఉగాది పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లోని సీతారామ చంద్ర స్వామి దేవాలయం కమిటీ నూతన అధ్యక్షుడిగా కుంట నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నేరండ్ల వెంకట్‌గౌడ్, రామ్‌దేవ్ జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా నేరండ్ల రాజుగౌడ్, కోశాధికారిగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, మల్లయ్య, వీరేశం, ఆంజనేయులు, స్వామిని ఎన్నుకున్నారు.

నేపాల్ యాత్ర పుస్తకావిష్కరణ

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 10 : ప్రముఖ రచయిత డాక్టర్ సుధాకర్ రచించిన నేపాల్ యాత్ర పుస్తకాన్ని సిద్దిపేట పబ్లిక్ వెల్ఫేర్ సర్వెంట్ హోంలోబుధవారం ఎన్జీవోస్ భవన్ అధ్యక్షుడు ఐత అంజయ్య, సెక్రటరీ విక్రంరెడ్డి,ఆర్థిక కార్యదర్శి మధుసూదన్, కథాశిల్పి చంద్రయ్య, సీనియర్ జర్నలిస్ట్ అంజయ్య,శ్రీనివాస్ ఆవిష్కరించారు.

నిరాశ్రయులకు అన్నదానం

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 10 : నిరాశ్రయులకు అండగా ఉంటామని సిద్దిపేట ఇందిరమ్మ కాలనీ వాసవి క్లబ్ అధ్యక్షుడు బెజగం కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని నిరాశ్రయుల కేంద్రంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బాలరాజు, కూర శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జూదం స్థావరం పై దాడి

చేర్యాల, ఏప్రిల్ 10 : పట్టణంలోని ఓ క్లినిక్‌లో ఐదుగురు జూదం ఆడుతుండడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు , చేర్యాల పోలీసులతో కలిసి రైడ్ చేసి వారిని పట్టుకున్నారు. జూదం ఆడుతున్న ప్రదేశంలో నిందితుల నుంచి రూ.34,890 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చేర్యాల పోలీసులు జూదం ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలు, ఇండ్లల్లో జూదం ఆడితే సమాచారం ఇవ్వాలని, అక్రమంగా ఇసుక, పీడీఎస్ బియ్యం రవాణా చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు.

అధ్యక్షుడిగా రవి

కోహెడ, ఏప్రిల్ 10: కోహెడ గ్రామ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా గడ్డం రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కోహెడ మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో భాగంగా ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా గడ్డం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణపెల్లి రాజేశం, కోశాధికారిగా శ్రావణపెల్లి సందీప్ ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో నాయీ బ్రాహ్మసంఘం సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణి మృతి

అక్కన్నపేట, ఏప్రిల్ 10: మండలంలోని చౌటపల్లికి చెందిన గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. స్థానిక ఎస్సైవివేక్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలవేని అశోక్‌కు హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన నాగలతతో నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేండ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం నాగలత ఎనిమిది నెలల గర్భిణి. ఇటీవల ఇంట్లో వరకట్నం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నాగలత ఇంటో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకువెళ్లేలోపు మృతి చెందింది. కాగా, మృతురాలు తండ్రి నకిరబోయిన రాజయ్య, కుటుంబ సభ్యులు మాత్రం తమ కూతురు నాగలతను అత్తింటి వారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో అత్తింటి వేధింపుల కారణంగానే తమ కూతురు చనిపోయిందని రాజయ్య ఫిర్యాదు చేశారు. ఫోరెన్స్ రిపోర్ట్ నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

హుస్నాబాద్, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రామ్మూర్తి ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల నాయకులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ ఓటర్లు, సీనియర్ సిటిజన్ ఓటర్ల జాబితాపై చర్చ జరిగింది. పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ కోసం కేటాయించిన ఫామ్స్‌పై అవగాహన కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ జాబితాను రాజకీయ పార్టీల నాయకులకు అందజేశారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు లింగమూర్తి, బీజేపీ నాయకుడు శ్రీనివాస్, బీఎస్పీ నాయకుడు రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు మహేశ్‌రెడ్డి

తొగుట, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ యువజన నాయకుడు తిపిరెడ్డి మహేశ్‌రెడ్డి నాయకత్వంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ ఎన్నికల్లో మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ నెల 13న జరిగే యువ గర్జన సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాలు అన్యాయానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధిచెప్పాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మాదాసు అరుణ్‌కుమార్, యూత్ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్, సురేశ్‌గౌడ్, స్వామి, రాజశేఖర్, తుక్కాపూర్ వార్డు సభ్యులు బొయిని బాల్‌రాజు, కరుణాకర్‌రెడ్డి, మహేశ్, బాలరాజు, స్వామి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జగదేవ్‌పూర్, ఏప్రిల్10: మండలంలోని ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి వసంతరావుతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుకాణాదారులు ప్రభుత్వం ఆమోదించిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. విత్తనాలు ఎరువులు విక్రయించిన రైతులకు బిల్లు తప్పకుండా ఇవ్వాలని సూచించారు.కార్యక్రమలలో ఆయా ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు నాగరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉగాది సంబురాలు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 10 : తెలుగు సంవత్సరాది ఉగాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు.సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల,జాతీయ సాహిత్య పరిషత్ వారు సంయుక్తంగా బుధవారం ఉగాది సంబురాలు నిర్వహించారు.అంతకు ముందు బడిపిల్లల పుస్తకాన్ని పరిచయం చేశారు. 30 మంది కవులు,విద్యార్థులు కవితా గానం చేశారు. అనంతరం ఉగాది పచ్చడితో షడ్రుచులను ఆస్వాదించారు. కవులను ప్రిన్సిపాల్ సన్మానించారు.కార్యక్రమంలో కవులు రాజమౌళి, ఉండ్రాళ్ల రాజేశం, అధ్యాపకులు మహేందర్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, బస్వరాజ్‌కుమార్, మురళీధరశర్మ, లక్ష్మి, సరస్వతి, జలజరాణి, మాధవీలత, సయ్యద్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడానికే చలివేంద్రం

మిరుదొడ్డి, ఏప్రిల్ 10 : వేసవిలో ప్రయాణికులకు దాహార్తి తీర్చడానికే చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని నైపుణ్య యూత్ ఆర్గనైజేషన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొగుళ్ల ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మిరుదొడ్డి టౌన్‌లో నైపుణ్య ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని ప్రయాణం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, చందు, కరుణాకర్, అంజాగౌడ్, రాజయ్య పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలో..

సిద్దిపేట, ఏప్రిల్ 10: సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన ఎదుట అవిఫెర్టిలిటీ, లాప్రోస్కోపిక్ దవాఖాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, ఎడ్ల అరవిందర్‌రెడ్డి, వంగ తిరుమల్ రెడ్డి,వడ్లకొండ సాయికుమార్, దుద్దెడ మాజీ సర్పంచ్ మంచాల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సమీక్ష

జగదేవ్‌పూర్ ఏప్రిల్10: మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ కోరారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస వర్మ, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్య, సరఫరాలోపాలు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పీర్లపల్లి ధర్మారం ప్రత్యేకాధికారి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10 : అల్లా దయతో రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని సిద్దిపేట మూడో వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని మూడో వార్డులో ముస్లింలకు రంజాన్ తోఫా (కానుక) లను కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్‌రెడ్డి పంపిణీ చేశారు. వార్డు నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, నిమ్మ మహేందర్ రెడ్డి, ఇరేణి మల్లేశం, నరేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిద్దిపేటలో రంజాన్ తోఫాలు అందజేస్తున్న తిరుమల్‌రెడ్డి

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం..చింతమడక వాసులకు శాపం

చింతమడకలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంగా కారణంగా రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం

సిద్దిపేటరూరల్, ఏప్రిల్10: కాంగ్రెస్ అంటేనే కరెంట్ కష్టాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇప్పటికే కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలను ఒకటి, రెండు రోజుల్లోనే అధికారులు మార్చి విద్యుత్‌ను పునరుద్ధరించేవారు. ప్రభుత్వం మారడంతో అధికారులు పనులు చేసేందుకు మొండికేస్తున్నట్లు కనిపిస్తోంది. సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలోని ఓ వీధిలో విద్యుత్ స్తంభం రోడ్డు మధ్యలో ఉంది. గురువారం గ్రామంలో పెద్దమ్మ బోనాల పండుగ జరుగనున్నది. మూడునెలలుగా విద్యుత్‌శాఖ అధికారులకు మాజీ ఉపసర్పంచ్ రవి చెబుతున్నా పట్టించుకోవడం లేదు. ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఏడీకి, స్థానిక జేఎల్ఎంకు చెప్పినా పట్టించుకోవడం లేదని మీడియాకు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై అధికారులకు ఫోన్ చేసినా కనీసం ఎత్తడం లేదని వాపోయాడు. భక్తులు ఇబ్బందులు పడుతారనే ఉద్దేశంతోనే మూడునెలలుగా అధికారులకు చెబుతున్నా వినిపించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని పక్కకు తొలిగించాలని కోరాడు.

వాహనాల తనిఖీ

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్10: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్దూరు మండల కేంద్రంలో ఏఎస్సై జగదీశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఎవరైనా రూ. 50వేల కంటే ఎక్కువ డబ్బులు వెంట తీసుకెళ్లరాదన్నారు. హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుళ్లు రవి, అనిల్‌కుమార్, సిద్ధార్థ, సురేశ్ పాల్గొన్నారు.

నేడు జ్యోతిబాపూలే జయంతి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 10: మహనీయుల జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11వతేదీ గురువారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిబాపూలే జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ముక్కెర సంపత్ తెలిపారు. స్థానిక అంబేద్కర్‌చౌరస్తాలో నిర్వహించే ఈకార్యక్రమానికి బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, ప్రజాసంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్10: మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో వివిధ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి స్వప్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆరోతరగతిలో 40, ఏడోతరగతిలో 12, ఎనిమిదో తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది నూతనంగా ప్రారంభం కానున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో 40, సీఈసీలో 40సీట్లు, ద్వితీయ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో 28, సీఈసీలో 39 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మురాయించిన ఆర్టీసీ బస్సు

గజ్వేల్, ఏప్రిల్ 10: గజ్వేల్ బస్టాండ్ ఎదుట బుధవారం ఉదయం 10:30 గంటలకు రామాయంపేట వెళ్లేందుకు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(ఏపీ28 జడ్ 4608) ఉంది. రామాయంపేట వైపు ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు వచ్చి బస్సు ఎక్కారు. డ్రైవర్ ఎంత ప్రయత్నం చేసినా బస్సు ముందుకు కదలలేదు. దీంతో బస్సు ఎక్కిన ప్రయాణికుల సాయం తీసుకొని కండక్టర్ సైతం తోశారు. అయినా బస్సు కదలకపోవడంతో మరో ఆర్టీసీ డ్రైవర్ సాయంతో కదిలించి రోడ్డు పక్కన ఉంచారు. రామాయంపేట వైపు వెళ్లే ప్రయాణికులు తప్పని పరిస్థితిలో ఆటోలో వెళ్లారు. రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఆగిపోవడంతో ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వైపు వచ్చే వాహనాలకు ఇబ్బందిగా మారింది.

బేకరీ యజమానికి జరిమానా

హుస్నాబాద్‌టౌన్ ఏప్రిల్ 10: బూజు పట్టిన కేక్ విక్రయించిన మంజునాథ బేకరీ యజమానికి రూ.ఐదువేల జరిమానా విధించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం తెలిపారు. ఈనెల 6వతేదీన గజ్జెల్లి సాగర్ అనే వ్యక్తి సదరు బేకరీలో కేక్ కొనుగోలుచేసి ఇంటికి వెళ్లి చూడగా బూజు పట్టి ఉండటంతో మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు బేకరీని తనిఖీ చేసి కేకుల తయారీలో న